ఈ ఋతుపవనాలు రెండు రకాలు : ఒకటి అరేబియా సముద్రం నుండి వీచే పవనాలు. రెండు, బంగాళాఖాతం మీదుగా వీచే పవనాలు. పటం-1 లోని బాణం గుర్తులు పవన దిశను సూచిస్తాయి.

- బంగాళాఖాతంలో ఏర్పడిన మేఘాలను పవనాలు దేశంలోని ఏ ప్రాంతానికి తీసుకొనిపోతాయి?
- అరేబియా సముద్రంలో ఏర్పడిన మేఘాలను పవనాలు దేశంలోని ఏ ప్రాంతానికి తీసుకొనిపోతాయి?
- పవనాలు పశ్చిమబెంగాల్‌కు, ఢిల్లీకి, లక్నోకు ఋతుపవనాలను ఏ దిశనుండి తీసుకుపోతాయి?
- పవనాలు బొంబాయికి, హైదరాబాద్‌కు, బెంగళూరుకు ఋతుపవనాల్ని ఏ దిశ నుండి తీసుకొనిపోతాయి?

**ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం:**

- మీ ప్రాంతంలో ఏ నెలల్లో ఎక్కువ వర్షం కురుస్తుంది? అత్యధిక వర్షపాతం గల మూడు నెలలను పేర్కొనండి.
- మీరుండే ప్రాంతంలో ఏ నెలల్లో తక్కువ వర్షం కురుస్తుంది? అత్యల్ప వర్షపాతంగల మూడు నెలలను తెలపండి.
- మీ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం సాధారణ వర్షపాతం ఉంటుందా? లేదా సంవత్సరానికో విధంగా ఉంటుందా?
- తక్కువ వర్షం కురిసి కరవు వచ్చిన సంవత్సరాలు మీకేమైనా అనుభవమైనాయా?
- అధిక వర్షాలు కురిసి వరదలు వచ్చిన సంవత్సరాలు మీకేమైనా అనుభవమైనాయా?

ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి ఋతుపవనాలు జూన్ మొదట్లో ప్రవేశిస్తాయి. ఇవి ఒకటవ పటంలో చూపిన విధంగా రాయలసీమ జిల్లాలైన చిత్తూరు, కర్నూలు ప్రాంతాలను మొదట చేరతాయి. పశ్చిమ కనుమలలో వర్షించిన మేఘాలు తక్కువ తేమ కలిగి పొడిమేఘాలు, పొడిగాలులతో రాయలసీమను చేరుతాయి.

పశ్చిమ కనుమలవంటి పర్వతశ్రేణులు మేఘాలకు అడ్డుతగలడంతో అవి పైకి వెళ్ళి చల్లబడి వర్షాన్నిస్తాయి. పర్వత ప్రాంతంలో ఈ రకమైన వర్షపాతం సాధారణమైనది. ఈ మేఘాలు పర్వతానికి అభిముఖంగా వెళ్ళి వర్షించి పొడిమేఘాలుగా మారి (తేమను కోల్పోయి) పర్వతాలకు అవతలివైపు చాలా తక్కువ వర్షపాతాన్నిస్తాయి. రాయలసీమ ప్రాంతాన్ని చేరినపుడు ఈ మేఘాలు అందుకే తక్కువ వర్షాన్నిస్తాయి.


నైరుతి ఋతుపవనాలు తెలంగాణ జిల్లాలలో అధిక వర్షాన్ని ఇచ్చి తూర్పు కనుమలు దాటి వెల్లుతాయి.

మే నుండి అక్టోబరు నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడే తుఫానులు ఆంధ్రప్రదేశ్ అంతటా తీరప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడానికి తోడ్పడతాయి. అల్పపీడనంవల్ల కురిసే వర్షాన్ని తుఫాను వర్షాలు అంటారు. వేసవికాలంలో సముద్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలవల్ల ఈ తుఫానులు ఏర్పడతాయి. తుఫాను సమయంలో అన్నివైపుల నుండి తుఫాను కేంద్రానికి గాలి వీస్తుంది. పైకి లేచిన సుడిగాలులు వర్షానికి కారణమవుతున్నాయి. గాలులతో కూడిన తుఫాను తన కేంద్రంనుండి వేగంగా కదిలి అధిక వర్షపాతంతోను, గాలులతోను తీరప్రాంతాలను అతలాకుతలం చేస్తాయి. ఇవి తీరప్రాంతానికి వర్షాన్నివ్వడంతోపాటు నష్టాన్ని కూడా కలిగిస్తాయి.

అక్టోబరు తర్వాత వాయుదిశ మారి బంగాళాఖాతం మీదుగా నైరుతి దిశవైపు పవనాలు వీస్తాయి. వీటి మూలంగా ఆంధ్రప్రదేశ్‌లో తీరప్రాంతంలో అక్టోబర్ - డిసెంబర్ నెలల మధ్య అధిక వర్షపాతం; రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లో సాధారణ వర్షపాతం ఉంటాయి. వీటినే 'ఈశాన్య ఋతుపవనాలు' లేదా 'తిరోగమన ఋతుపవనాలు' అంటారు.

- ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో వర్షపాతాన్ని సూచించే పటం-2ని పరిశీలించండి.

పటం–2: ఆంధ్రప్రదేశ్‌లో వార్షిక వర్షపాతాన్ని సూచించే పటం




© SCERT not to be republished

i) మీ జిల్లాలో ఎటువంటి వర్షపాతం (అధిక, అల్ప, అత్యల్ప వర్షపాతం) ఉంది?

ii) ఒంగోలు, అనంతపురం, ఆదిలాబాదు, మచిలీపట్టణం, హైదరాబాద్ పట్టణాలలో ఏ పట్టణంలో తక్కువ వర్షపాతం, ఏ పట్టణంలో ఎక్కువ వర్షపాతం ఉన్నాయి?

iii) ఇలాంటి మరిన్ని ప్రశ్నలను ఒకరినొకరు అడగండి.

- మీ అట్లాసులోని భారతదేశ భౌతిక పటంలో పశ్చిమ కనుమలను, తూర్పు కనుమలను గుర్తించండి.
- పశ్చిమ కనుమలు వ్యాపించిన రాష్ట్రాలు ____________.
- తూర్పు కనుమలు వ్యాపించిన రాష్ట్రాలు ____________.
- పశ్చిమ కనుమలు ఆంధ్రప్రదేశ్‌కు ఏ దిక్కున ఉన్నాయి____________.
- భారతదేశ పటం గీసి అందులో తూర్పు, పశ్చిమ కనుమలను ఊహించి చిత్రించండి. రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఏ నెలలలో వర్షం కురుస్తుందో చూపించండి.

